సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 30 । మార్చి । 2024





## వడదెబ్బతో జాగ్రత్త

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున వడదెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

II లో



## 8,970 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.95 అడుగులుగా ఉంది.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శని (సా॥) | సెహరీ ఆది (ఉ॥) |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 6.25 | 4.37 |
| కాకినాడ | 6.24 | 4.37 |
| అమలాపురం | 6.24 | 4.37 |

### న్యూస్‌రీల్

## కాకినాడ జిల్లా కలెక్టర్‌గా నివాస్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ నివాస్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

**కాకినాడ సిటీ:** జిల్లా నూతన కలెక్టర్‌గా జె.నివాస్ కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, ఇతర జిల్లా స్థాయి అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయడంతో పాటు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని అనుమతులూ ప్రణాళిక ప్రకారం ఇస్తూనే.. ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తామని తెలిపారు. కింది స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకుని వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ నివాస్ తెలిపారు. ఆయనకు జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి, సమాచారశాఖ డీడీ నాగార్జున, కాకినాడ అర్బన్ తహసీల్దార్ కె.చెల్లన్‌దొర, కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు, ఇతర శాఖల అధికారులు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

# ప్రతి గింజా కొనేలా..



- రబీ ధాన్యం సేకరణకు అధికారుల ప్రణాళికలు
- ఎన్నికల ప్రక్రియ ఉన్నా.. రైతులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చర్యలు
- జిల్లా వ్యాప్తంగా 231 కొనుగోలు కేంద్రాలు
- 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- సాధారణ రకం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,183
- ఎ–గ్రేడ్‌కు రూ.2,203
- ఇప్పటికే మొదలైన వరి కోతలు

**సాక్షి, రాజమహేంద్రవరం:** జిల్లాలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 2,204 హెక్టార్లలో పూర్తవడం ద్వారా 4 శాతం లక్ష్యాన్ని రైతులు సాధించారు. రాజానగరం మండలం మరింత పురోగతి సాధిస్తూ 1,000 హెక్టార్లలో పూర్తయి 30 శాతానికి చేరువైంది. వారం పది రోజుల వ్యవధిలో వరి కోతలు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు లబ్ధి చేకూర్చాలన్న తలంపుతో ప్రభుత్వం ముందుకెళుతోంది. దళారుల మోసాల బారిన పడకుండా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. కోతలు పూర్తయిన వెంటనే ఆలస్యం లేకుండా



ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న సిబ్బంది (ఫైల్)

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధమైంది. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసి, దన్నుగా నిలవాలన్న ఆకాంక్షతో ముందుకెళుతోంది. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియలో తలమునకలవుతున్నా.. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ధాన్యం నూర్పిళ్లు జరగడానికంటే ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వస్తోంది. వచ్చే నెల మొదటి వారం నుంచి ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ధాన్యం కొనుగోలుపై ఇప్పటికే అధికారులకు శిక్షణ సైతం పూర్తి చేశారు.

**4.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి**

జిల్లావ్యాప్తంగా వరి సాధారణ విస్తీర్ణం 59,348 హెక్టార్లు కాగా.. ఈ రబీలో 55,315 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఎకరాకు 50 బస్తాల (75 కిలోలు) ధాన్యం చొప్పున 4.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక అవసరాలు, బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు మినహాయిస్తే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3.20 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనికి గాను వచ్చే నెల ఒకటో తేదీ నాటికి జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) 231 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ వెంటనే కొనుగోళ్లు ప్రారంభించనున్నారు.

**సర్వసన్నద్ధం**

ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పక్కాగా పూర్తి చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి 18 మండల స్థాయి సేకరణ కమిటీల సమక్షంలో 142 మిల్లులను గుర్తించారు. వాటికి కస్టోడియన్ అధికారుల నియామకం పూర్తి చేశారు. సేకరణ లక్ష్యాలను సాధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, రవాణాకు 2,310 మంది హమాలీలు, 355 వాహనాలను సిద్ధం చేశారు. మిల్లర్ల ద్వారా బ్యాంక్ గ్యారంటీకి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొబైల్ టీముల ద్వారా కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. పొలం నుంచి ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు చేర్చి, రైతులకు మద్దతు ధర కల్పించేంత వరకూ అధికారులు అడుగడుగునా అండగా నిలవనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం నింపేందుకు అవసరమైన గోనె సంచులు 50 శాతం సిద్ధం చేసుకుంటున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించే పనిని వ్యవసాయ అధికారులు పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

**ముందుగానే మద్దతు ధర**

రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడానికి ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గతం కంటే ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.143 పెంచింది. ఈ పెంపుదల రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకం ధాన్యం మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.2,183గా, గ్రేడ్–ఎ రకానికి రూ.2,203గా నిర్ణయించింది.

**దళారులకు ఆస్కారం లేకుండా..**

తేమ, రంగు మారడం, బహిరంగ విపణిలో ధర పలకడం లేదనే కారణాలు చెప్పి రైతులను దళారులు మోసం చేయకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది. ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాలు, తూనికలు–కొలతలు, ఇతర శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సేకరణ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా చేపడుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు అప్పగించడం, తిరిగి మిల్లర్ల ద్వారా బియ్యం సేకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన సిబ్బందిని ఆర్‌బీకేల వద్ద సిద్ధంగా ఉంచారు. ఈ–క్రాప్, తేమ శాతం నిబంధనల ప్రకారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (వీఏఏ) ధాన్యం సేకరిస్తారు. ధాన్యం రవాణా చేసే వాహనాలపై నిఘా పెడుతున్నారు. రవాణా చార్జీలు ఎవరికి చెల్లించాలనే విషయమై జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**జిల్లాలో మండలాల వారీగా ధాన్యం కోతలు జరిగిన విస్తీర్ణం (హెక్టార్లలో)**

| మండలం | వరి సాగు | కోతలు |
|---|---|---|
| రాజమహేంద్రవరం రూరల్ | 2,006 | 635 |
| రాజానగరం | 3,328 | 1,000 |
| కోరుకొండ | 1,757 | 90 |
| గోకవరం | 1,537 | 40 |
| సీతానగరం | 3,280 | 250 |
| రంగంపేట | 795 | 90 |
| దేవరపల్లి | 2,838 | 25 |
| గోపాలపురం | 1,707 | 38 |
| తాళ్లపూడి | 3,375 | 24 |
| నల్లజర్ల | 2,093 | 25 |

### పారదర్శకంగా సేకరణ



వరుసగా నాలుగు సీజన్లలో ధాన్యం సేకరణ చేపట్టాం. ప్రస్తుతం ఐదో సీజన్‌లో కొనుగోలుకు సన్నద్ధమవుతున్నాం. ఎన్నికల విధులు, ధాన్యం సేకరణ పనులను సమాంతరంగా నిర్వహించాల్సి ఉంటుంది. అందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. ఇప్పటికే అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. రైతులు పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర అందేలా చూస్తాం. రైతులకు, మిల్లర్లకు మధ్య దళారుల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకుంటాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్, తూర్పు గోదావరి

### దిగుబడులు ఆశాజనకం



రబీ ధాన్యం దిగుబడులు ఈ ఏడాది ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది కంటే ప్రస్తుతం మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఎకరాకు 50 బస్తాల (75 కేజీలు) దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. జిల్లాలో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెలలో మరింత వేగం పుంజుకోనున్నాయి.

– ఎ.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

# సమరానికి సై



కాకినాడ సముద్ర తీరాన మోహరించిన కమాండోలు



సముద్ర జలాలను మంచినీటిగా మార్చే విధానాన్ని పరిశీలిస్తున్న భారత్ - యూఎస్ అధికారులు



భారత నౌకాదళం హెలికాప్టర్ ద్వారా యుద్ధ ప్రదేశంలోకి తాడుతో కమెండోస్ జీపు తరలింపు

- సాగర తీరాన ఆకట్టుకున్న ఇండో–అమెరికన్ సైనిక విన్యాసాలు
- టైగర్ ట్రయాంఫ్–24 పేరిట నిర్వహణ
- ఆసక్తిగా తిలకించిన భారత్, యూఎస్ రక్షణ అధికారులు
- నేటితో ముగింపు

**కాకినాడ రూరల్:** సువిశాల సాగరం.. ఉధృతంగా ఎగసి పడుతున్న కెరటాల హోరు.. పరిసరాలన్నీ నిర్మానుష్యం.. అకస్మాత్తుగా సముద్ర జలాల నుంచి అత్యంత వేగంగా తీరానికి చేరుతున్న భారత నౌకాదళం యుద్ధ నౌకలు.. అత్యాధునిక ఆయుధాలు చేబూని వాటి నుంచి తరలి వస్తున్న సాయుధ దళాలు.. పైన గగనతలంలో నౌకా, వాయుదళాల హెలికాప్టర్ల హోరు.. వాటి నుంచి తీరం పైకి దిగుతున్న సైనిక దళాలు.. కాకినాడ సాగర తీరంలో శుక్రవారం కనిపించిన యుద్ధ వాతావరణ దృశ్యమిది. ఇదంతా చూసి ఏ యుద్ధమో వచ్చిందని అనుకుంటే పొరపాటు పడినట్టే.

**ఎందుకంటే..**

ఊహించని విధంగా ఏదైనా దేశంతో యుద్ధం మొదలైనప్పుడో.. సముద్ర మార్గం నుంచి భారత భూభాగంలోకి ఉగ్రవాదులు చొచ్చుకుని వచ్చినప్పుడో.. వారిని తిప్పి కొట్టేందుకు.. దేశాన్ని, ప్రజలను రక్షించుకునేందుకు వీలుగా.. రక్షణ దళాల సంసిద్ధతను పరిశీలించే లక్ష్యంతో భారత్ – అమెరికా రక్షణ దళాలు చేపట్టిన సంయుక్త విన్యాసాల్లో భాగమే ఈ సమర సన్నాహాలు. టైగర్ ట్రయాంఫ్–24 పేరిట



విన్యాసాలను తిలకిస్తున్న ఇండో-అమెరికన్ అధికారులు

చూపరులకు గగుర్పాటు కలిగించేలా నిర్వహించిన ఈ యాంఫిబియస్ (ఉభయచర) విన్యాసాలకు కాకినాడ సూర్యారావుపేట వద్ద ఉన్న నేవల్ ఎన్‌క్లేవ్ బీచ్ వేదిక అయ్యింది. ఈ నెల 18న విశాఖలోను, దానికి కొనసాగింపుగా ఈ నెల 27న కాకినాడలో ప్రారంభమైన ఈ విన్యాసాలు శనివారం ముగియనున్నాయి. కాకినాడ సీ ఫేజ్‌లో రెండు దేశాల రక్షణ దళాల మధ్య సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు చేపట్టిన ఈ విన్యాసాలతో కాకినాడ సాగర తీరం కదన రంగాన్ని తలపించింది. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని తూర్పు నావికా దళం ఈస్టర్న్ ఫ్లీట్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్, జపాన్‌లోని యూఎస్ నావికా దళం సెవెంత్ ఫ్లీట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వైస్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోక్విన్ మార్టినెజ్ మీడియాతో మాట్లాడారు. భద్రతాపరంగా కాకినాడలోని వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. కాకినాడ తీరంలో సముద్ర జలాలతో పాటు, నేలపై కూడా విన్యాసాలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ ఆర్మీ 54వ పదాతిదళం (హైదరాబాద్) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్, యూకే కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ పాల్గొన్నారు.

**విన్యాసాలు నిర్వహించారిలా..**

- గాలిలో పెద్ద రొద చేస్తూ జెట్ యుద్ధ విమానాల విహారం.. హెలికాప్టర్ల చక్కర్లు.. తీరంలో యుద్ధ ట్యాంకుల మోహరింపు సాగర జలాల్లో ఐఎన్ఎస్ ఐరావత్, ఐఎన్ఎస్ కేసరి యుద్ధ నౌకలు.. అత్యాధునిక ఆయుధాలతో భారత నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్, సైనిక దళాలు సుమారు 700 మంది ఈ విన్యాసాల్లో పాల్గొన్నారు.
- అలాగే, అమెరికాకు చెందిన యుద్ధనౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, హెలికాప్టర్లతో పాటు సుమారు 350 మంది సిబ్బంది కూడా ఇందులో పాలు పంచుకున్నారు.
- విన్యాసాల్లో భాగంగా క్రాస్ డెక్ హెలికాప్టర్ ఆపరేషన్లు చేపట్టారు. బహుళ డ్రోన్‌లు, యాంటీ డ్రోన్ పరికరాలు, పదాతిదళం, మెకనైజ్డ్ పదాతి దళం, పారా ఎస్ఎఫ్, ఆర్టిలరీ, ఇతర సహాయక ఆయుధాలతో సైనికులు పాల్గొన్నారు.
- యుద్ధ నౌకలు తీరానికి చేరుతుండగా, వాటిని రక్షణ దళాలు అనుసరించడం.. గగనతలం నుంచి నేవీ, ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ల నిఘా.. మరో రెండు హెలికాప్టర్ల నుంచి ఆయుధాలతో సైనికులు చకచకా కిందకు దిగి, భద్రమైన ప్రదేశానికి చేరుకుని శత్రువులపై ఆయుధాలు గురి పెట్టడం.. యుద్ధ నౌకల నుంచి ఉభయచర యుద్ధ నౌకలు తరలి రావడం.. ఒడ్డుకు చేరుకున్న సైనిక దళాలు తమను శత్రు సైన్యం పసిగట్టకుండా ఉండేందుకు స్మోక్ కమ్మేలా చేయడం.. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ (హెచ్ఏడీఆర్) చర్యలను, సైనిక విన్యాసాల్లో గాయపడిన వారికి శిబిరాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడం.. సముద్ర జలాలను తాగునీటిగా మార్చి వినియోగించుకోవడం వంటివి ప్రదర్శించారు.
- అత్యాధునిక డ్రోన్‌లు, ఇతర పరికరాలను ఇరు దేశాల అధికారులు పరిశీలించారు.



# ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఇక్కడ భద్రపరిచామని కలెక్టర్ కె.మాధవీలత ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు. వాటి భద్రతకు తీసుకున్న చర్యలను వివరించారు. గోడౌన్ నుంచి ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు చెందిన తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు తరలించే విధానంపై సీఈఓ సమీక్షించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఈవీఎం గోడౌన్‌లోని రిజిస్టర్‌లో ముఖేష్ కుమార్ మీనా సంతకం చేశారు. ఆయన వెంట ఎస్పీ పి.జగదీష్ తదితరులున్నారు. తొలుత రాజమహేంద్రవరం చేరుకున్న ఆయనకు కలెక్టర్ మాధవీలత, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి స్వాగతం పలికారు.



నన్నయ వర్సిటీలో కౌంటింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్, ఇతర అధికారులు

**కౌంటింగ్ కేంద్రాల పరిశీలన**

**రాజానగరం:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూములను ముఖేష్ కుమార్ మీనా పరిశీలించారు. ఈ ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను, ఇతర అనుబంధ యూనిట్లను ఇక్కడకు తీసుకుని వచ్చి, నియోజకవర్గాల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తామని కలెక్టర్ మాధవీలత ఆయనకు వివరించారు. ఈ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. దీనికోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలు, రూట్ మ్యాప్‌లను వివరించారు. ఇక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ జగదీష్ వివరించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, రాజానగరం, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్.తేజ్‌భరత్, అశుతోష్ శ్రీవాత్సవ్, ఎ.చైత్రవర్షిణి, కేఎల్ శివజ్యోతి, ఆర్‌వీ రమణా నాయక్, ఎం.మాధురి, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

# కుందుల ఓ 420



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

- అక్రమ మద్యం కేసులో 6 నెలలు చిప్పకూడు తిన్నారు
- లారీ క్లీనర్ స్థాయి నుంచి కోట్లాది రూపాయల అక్రమ సంపాదన
- 200 ఎకరాల చేపల చెరువులు అక్రమంగా తవ్వుకున్నారు
- ఆ వర్గం వారంతా బ్లేడ్ బ్యాచ్, సెటిల్మెంట్, గంజాయి బ్యాచే
- టీడీపీ నేతపై మాజీ ఎమ్మెల్యే శేషారావు తీవ్ర ఆరోపణలు

**నిడదవోలు:** లారీ క్లీనర్‌గా, మద్యం సిండికేట్‌లో గుమస్తాగా జీవితాన్ని ప్రారంభించిన కుందుల సత్యనారాయణ అక్రమ సంపాదనతో రూ.కోట్లకు పడగలెత్తాడని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కుందుల ఓ 420 అని, ఏ పార్టీయో తెలియని వ్యక్తి అని, నిత్యం ప్రజలను మోసం చేస్తూ టీడీపీ టికెట్‌ను అధిష్టానం తనకు కేటాయించిందంటూ ఆలయాల్లో పూజలు చేసిన చీటర్ అని మండిపడ్డారు. 1995లో నాటి సీఎం ఎన్‌టీఆర్ హయాంలో మద్యనిషేధం విధించిన సమయంలో అక్రమ మద్యం కేసులో కుందుల ఆరు నెలల జైలు శిక్ష అనుభవించి, చిప్పకూడు తిన్నారని ధ్వజమెత్తారు. తన వర్గాన్ని దొంగల బ్యాచ్ అంటూ నిందించిన కుందుల వర్గంలోని వారే పక్కా పేటీఎం బ్యాచ్ అని, గంజాయి వ్యాపారం, బెట్టింగ్, సెటిల్మెంట్లు, దందాలు, బెట్టింగ్‌లకు పాల్పడే బ్యాచ్ అని విరుచుకుపడ్డారు. 2014 వరకూ మాజీ మంత్రి పితాని సత్యనారాయణతో కలిసి కాంగ్రెస్‌లో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం పగలు ఒక పార్టీ, రాత్రి మరో పార్టీతో మంతనాలు చేస్తున్నారని ఆరోపించారు. తాను 40 ఎకరాల ఆసామీ కుమారుడినని, కుందుల మాత్రం మద్యం, ఇసుకలో అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించారని అన్నారు. ఈ అక్రమ సంపాదన ఏం చేయాలో తెలియక ప్రజాసేవ అంటూ కార్యకర్తలకు మాయమాటలు చెప్పి భ్రమలో బతుకుతున్నారని విమర్శించారు. ఆయనకు టికెట్ ఇస్తానంటూ చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చినట్టు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో తన పేరు మాత్రమే వచ్చిందని, కుందుల పేరు లేదనే విషయం తెలుకోవాలని అన్నారు. టీడీపీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, చంద్రబాబు, లోకేష్‌తో ఫొటోలు దిగి, నిడదవోలు సీటు తనదేనంటూ ప్రగల్భాలు పలుకుతూ, కార్యకర్తలను నిలువునా మోసం చేసిన వ్యక్తి కుందుల అని ఆయన ఆరోపించారు.

2014, 19 ఎన్నికల్లో తనకు డబ్బులు ఇచ్చానని చెబుతున్న కుందుల.. 2014లో కాంగ్రెస్‌లోనే ఉన్నారని శేషారావు గుర్తు చేశారు. ఉచిత ఇసుక పథకంలో తాను రూ.150 కోట్లు సంపాదించానని ఆరోపిస్తున్న కుందుల.. ఆ డబ్బులు ఎక్కడున్నాయో చెబితే తెచ్చుకుంటానని అన్నారు. 20 వేల లారీలు ఇసుక ఇచ్చానని చెబుతున్న కుందుల.. ఈ లెక్కన రెండు మూడు లక్షల లారీల ఇసుక కొల్లగొట్టి ఉంటారని ఆరోపించారు. 2014లో కుందుల 200 ఎకరాల చేపలు, రొయ్యల చెరువులు అక్రమంగా తవ్వుకున్నారని ఆరోపించారు. తనకు లారీలున్నాయని, ఉచిత ఇసుక పథకంలో రీచ్‌లు ఇవ్వాలని కోరగా అందుకు తాను నిరాకరించానన్నారు. ఉచిత ఇసుక పథకంలో గోదావరి నదీ పరీవాహక గ్రామాల్లోని కార్మికులు, బంటా కార్మికులు మాత్రమే ఇసుక రవాణా చేశారని, వారి నుంచి ఒక్క పైసా కూడా తాను తీసుకోలేదని శేషారావు అన్నారు. కుందుల తప్పుడు పనులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ఈ పాపాల నుంచి ప్రజలను కాపాడడానికే దేవుడు ఆయనను ఆసుపత్రికి పంపించారని విమర్శించారు. కోట్లాది రూపాయలు సంపాదించుకుని, ఎమ్మెల్యే అయిపోదామనే భ్రమలో తన వద్ద నుంచి ఇద్దరు ముగ్గురు వెళ్లిపోయారే తప్ప మిగిలిన కేడర్ అంతా తన వెంటే ఉందని శేషారావు అన్నారు. కుందుల ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఇక నీ పని అయిపోయిందంటూ వార్నింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### చోరీ కేసులో నిందితుడి అరెస్టు

148 గ్రాముల ఆభరణాల రికవరీ



బంగారు ఆభరణాలు, నిందితుడితో సీఐ శ్రీనివాస్, సిబ్బంది

**కాకినాడ రూరల్:** వివాహ వేడుకలో ఆహ్వానితుడిగా హాజరై కలివిడిగా తిరుతుగూ.. ఆపై బంగారు ఆభరణాలను దోచుకుపోయిన నిందితుడిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న సర్పవరం స్టేషన్ పరిధిలోని కమ్మ కల్యాణ మంటపంలో మధ్యాహ్నం వివాహ వేడుక జరిగింది. ఆ వేడుకలో సోఫాపై ఉంచిన హ్యాండ్ బ్యాగ్‌లోని 148గ్రాముల బరువుగల లాకెట్ కలిగిన మూడు బంగారు గొలుసులు మాయమవ్వడంతో బాధితుల ఫిర్యాదు మేరకు సర్పవరం స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు సూచనలలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టగా పిఠాపురం పట్టణానికి చెందిన కె.వీర శంకర్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచడంతో మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఏఎస్సై బలరాం, హెచ్‌సీలు సత్తిబాబు, గణేష్‌బాబు, సత్యనారాయణరాజు, వెంకటరత్నం, కానిస్టేబుళ్లు కీలకంగా పనిచేశారన్నారు.

### పెంటాథ్లాన్ క్రీడలో ప్రతిభ

**ఐ పోలవరం:** జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కాకినాడ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన మోడరన్ పెంటాథ్లాన్ క్రీడల్లో మండల పరిధిలోని ఐ పోలవరం భైరవపాలెం జెడ్పీస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.విజయ్, బి.రాజు, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి పి.ధనశేఖర్ విజయం సాధించారన్నారు. వీరు ఈ నెల 30, 31 తేదీల్లో తిరుపతి కేంద్రంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి బయలుదేరివెళ్లారని వ్యాయామ ఉపాధ్యాయులు షేక్‌మహ్మద్ షరీఫ్ తెలిపారు. అంతేకాకుండా హెచ్‌ఎం మల్లిపూడి వీరవెంకటసత్యనారాయణమూర్తి, సర్పంచ్ పెమ్మాడి బాబూరావు విద్యార్థులను అభినందించారు.

# వడదెబ్బతో జాగ్రత్త

- ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తగిన చర్యలు తీసుకోకుంటే ప్రాణాంతకమే
- ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి



పెదపల్లి పీహెచ్‌సీలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**అలమూరు/అంబాజీపేట/కాకినాడ సిటీ:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేసవికాలం ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఏప్రిల్ ద్వితీయార్థంలో పెరగవలసిన ఉష్ణోగ్రతలు మార్చి నెలాఖరు నాటికే సుమారు 35 నుంచి 38 డిగ్రీల మధ్య నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. రోజు రోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో భానుడి భగభగలు మిన్నంటుతున్నాయి. ఈ వేసవి సీజన్ ముగిసే నాటికి సాధారణ ఉష్ణోగ్రతలు కంటే దాదాపు మూడు డిగ్రీల వరకూ అధికంగా నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు, రోగ నిరోధ శక్తి తగిన మోతాదులో లేని అనారోగ్య తీవ్రత ఉన్న వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.

**వడదెబ్బ అంటే..**

వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత ఉన్న సమయంలో మానవుని శరీరంలోకి సంభవించే ఉష్ణోగ్రతలను తట్టుకోవడం లేదా నియంత్రించే శక్తి విఫలం కావడం వల్లే ఈ వడదెబ్బ సంభవిస్తుంది. సరియైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోకుండా ఉండటం కాని తీవ్ర వ్యాయామం లాంటి చురుకైన, శక్తికి మించి పనులు చేయడం వల్ల కాని ఈ వడదెబ్బ సంభవిస్తుంది. ఈ వేడిగాలుల వల్ల వడదెబ్బ (హీట్ స్ట్రోక్), శరీరంలో లవణాలు కోల్పోవడం (డీహైడ్రేషన్)తో కలిగే దుష్పరిణామాల వల్ల ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. వేడి వాతావరణంలో సంచరించేటప్పుడు అధిక ఉష్ణోగ్రత ముక్కు, కళ్ల ద్వారా శరీరంలోకి చేరుతుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా 106 డిగ్రీల వరకూ అమాంతంగా పెరిగిపోయే అవకాశం ఉంటుంది. చర్మం పొడిబారి పోయి ముట్టుకుంటే కాలిపోయే పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరంలోని ప్రాథమిక అంతర్గత అవయవాలు సక్రమంగా పనిచేయకపోవడం వడదెబ్బకు కారణమవుతుంది. అదే సమయంలో నీరు, రక్త పరిమాణం తగ్గిపోవడం వల్ల రక్తపోటు కూడా సంభవించే ప్రమాదముంది. వేసవికాలంలో వడదెబ్బకు గురైన వ్యక్తి సత్వరమే ప్రాథమిక చికిత్సను తీసుకుని తగిన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తే ప్రాణాప్రాయం నుంచి తప్పించుకోవచ్చునని వైద్యారోగ్యశాఖ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచి వైద్యారోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తోంది.

**వేసవిలో చేయాల్సినవి**

- రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తరచూ సేవించాలి.
- లేతరంగు కలిగిన తేలికగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. రెండు పూటలా స్నానం చేయాలి.
- ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు బయటకు వెళితే గొడుగు లేదా టోపీ ధరించాలి. లేకుంటే తలకు రుమాలు చుట్టుకోవాలి.
- ఇంట్లో కిటికీలు తెరచి గదిలోకి గాలి వచ్చి చల్లబడే విధంగా చర్యలు తీసుకోవాలి.




**లక్షణాలు**

- శరీర ఉష్ణోగ్రత అమాంతంగా పెరిగిపోవడం
- చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం
- పాక్షికంగా ఫిట్స్ రావడం లేక అపస్మారక స్థితికి చేరుకోవడం.
- మగత నిద్ర రావడం, కలవరింతలు పలకడం.
- పెదవులు ఎండిపోయి నోరు పిడచకట్టుకు పోవడం

**వేసవిలో చేయకూడనివి**

- మండు వేసవిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంకాలం 4 గంటల వరకూ బయట తిరగరాదు.
- సూర్య కిరణాలు, వేడిగాలులు నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- రహదారులపై విక్రయించే ఆహార పానీయాలు, రంగునీళ్లు సేవించరాదు. కలుషితమైన ఆహారం భుజించరాదు.
- ఎండవేళ్లలో శరీరంపై భారం పడే పనులు చేపట్టరాదు.
- మాంసాహారాన్ని తగ్గించాలి. మద్యం సేవించకుండా ఉండాలి.
- ముదురు, నలుపు రంగు దుస్తులు ధరించరాదు.
- వేడి అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా పని చేయరాదు, అలసట అనిపిస్తే సత్వరమే చల్లని ప్రదేశంలో సేద తీరాలి.



**ప్రథమ చికిత్స ఇలా..**



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చి గాలి తగిలేలా చేయాలి. శరీరం సాధారణ స్థాయి ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ మెత్తటి తడి గుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ కాని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితికి వెళ్లిన రోగికి నీరు తాగించకూడదు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ వడదెబ్బ పట్ల జాగ్రత్తతో వ్యవహరించాలి.

– ఎం.సుమలత, అదనపు జిల్లా వైద్యాధికారి, కొత్తపేట.

# వస్త్ర దుకాణాల్లో చోరీలకు పాల్పడే ముఠా పట్టివేత

**పోలీసుల అదుపులో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు**

**పి.గన్నవరం:** ఆటోలో వచ్చి వస్త్ర దుకాణాల్లో దుస్తుల చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషుల ముఠాను శుక్రవారం ముంగండ గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత జనవరిలో 8 మంది మహిళలు ఇదే గ్రామానికి ఆటోలో వచ్చి ఒక వస్త్ర దుకాణంలో రూ.20 వేల విలువైన దుస్తులు దొంగిలించి పరారయ్యారు. మళ్లీ అదే బృందంలోని మహిళలు శుక్రవారం ముంగండకు వచ్చి మరొక వస్త్ర దుకాణంలోకి వెళ్లారు. వీరిని స్థానిక ఆటో డ్రైవర్లు, వ్యాపారులు గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో రోడ్లు, పంట పొలాల వెంబడి పారిపోతున్న దొంగలను స్థానిక వ్యాపారులు, గ్రామస్తులు, ఆటో డ్రైవర్లు వెంబడించి పట్టుకున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి...

గత జనవరి 6వ తేదీ మధ్యాహ్నం ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న బండారు బొటిక్స్ అండ్ బ్యాగ్స్ షాపునకు ఆటోలో ఎనిమిది మంది మహిళలు వచ్చారు. ఆ సమయంలో షాపులో పనిచేసే అమ్మాయి ఉంది. దుస్తులు కొనుగోలు చేస్తున్నట్టు నటించి, రూ.20 వేల విలువైన డ్రెస్ మెటీరియల్‌ను కాళ్ల మధ్య పెట్టుకుని చోరీ చేశారు.



ముఠాలోని ఇద్దరు సభ్యులు

దొంగలు వెళ్లిన పోయిన తర్వాత యజమాని శ్రీనివాస్ వచ్చి దుస్తులు చోరీకి గురైనట్టు గుర్తించాడు. దీంతో స్థానికుల సాయంతో మోటారు సైకిళ్లపై వెళ్లి దొంగల కోసం గాలించినా ఫలితం లేదు. శుక్రవారం ఉదయం మళ్లీ అదే దొంగల ముఠా బొడ్డు నాగేశ్వరరావుకు చెందిన వస్త్ర దుకాణంలోకి వెళ్లారు. వీరిని గుర్తించిన స్థానిక ఆటో డ్రైవర్లు స్థానికులను అప్రమత్తం చేశారు. దీంతో ఎనిమిది మందిని పట్టుకుని ఆటోతో సహా పోలీసులకు అప్పగించారు. వీరిని విజయవాడ సమీపంలోని జి.కొండూరు మండలానికి చెందిన దేవరకొండ అంజమ్మ, జంగనాథం జువ్వాలమ్మ, కంపకాల కనకమ్మ, నల్లగొండ జువ్వాలమ్మ, మేడా రాజేశ్వరి, గరిక శకుంతల, పొన్నా వాసు, నామాల శ్రీనివాసరావులుగా గుర్తించారు. వీరిపై గతంలో కూడా కేసులు ఉన్నాయని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ఎస్సైతో పాటు క్రైమ్ బ్రాంచి పోలీసులు విచారణ చేపట్టారు.

# ముద్రగడతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు భేటీ

**అమలాపురం టౌన్/కిర్లంపూడి:** వైఎస్సార్ సీపీలో ఇటీవల చేరిన రాష్ట్ర కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంతో ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు కిర్లంపూడిలోని ముద్రగడ స్వగృహంలో శుక్రవారం ఉదయం భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకున్నారు. పార్టీలోకి ముద్రగడ లాంటి పెద్దలు రావడంతో అంతా కలిసి పనిచేసి, పార్టీ విజయానికి పాటు పడే అవకాశం వచ్చిందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా ముద్రగడకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కాకినాడలోని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను వేర్వేరుగా వారి ఇళ్లకు వెళ్లి కలిశారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నిర్వహించే ప్రచారంపై ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వారితో చర్చించారు.



కిర్లంపూడిలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని కలిసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

# జ్యోతుల కాలనీలో చోరీలు

**10 కాసుల బంగారం, రూ.60 వేల నగదు అపహరణ**

**జగ్గంపేట:** స్థానిక జ్యోతుల కాలనీలో గురువారం రాత్రి దొంగలు మూడు ఇళ్ల తాళాలు బద్దలు కొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 కాసుల బంగారం, రూ.60 వేల నగదు అపహరణకు గురయింది. బాధితుల కథనం ప్రకారం జ్యోతుల కాలనీ మూడవ, ఐదవ వీధిలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. మూడో వీధిలో అలమండ చందు ఇంటిపై భాగంలో వుంటూ తిరుపతి వెళ్లడంతో నాలుగు రోజులుగా ఇంటికి తాళాలు వేసి వున్నాయి. ఐదవ వీధిలో అడపా శ్రీనివాస్ (ఆటో డ్రైవర్) ఇంటికి తాళాలు వేసి బంధువులకు అనారోగ్యంగా వుందని వెళ్లాడు. అదే వీధిలో మరో ఇంటిలోను ఎవరు లేకపోవడాన్ని దొంగలు గమనించారు. గురువారం అర్ధరాత్రి ఇద్దరు లేక ముగ్గురు చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. అడపా శ్రీనివాస్ ఇంట్లో పది కాసుల బంగారం, రూ.60వేల నగదు అపహరించారు. మిగిలిన రెండు ఇళ్లలోను కొద్దిపాటి నగదు, వస్తువులు చోరీకి గురిఅయినట్లు గుర్తించారు. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది.



రెండో వీధిలో డాబాపై భాగంలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై నాగార్జునరాజు

## రేపు అవగాహన సదస్సు

**రాజమహేంద్రవరం రూరల్:** పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ(మెయిన్స్), జేఈఈ(అడ్వాన్స్‌డ్), నీట్ వంటి జాతీయ పరీక్షలపై ఆదివారం ఉదయం 10.00 గంటలకు రాజమహేంద్రవరం కాతేరులో గల తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకొనే విద్యార్థులు వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. తిరుమలఈడీయూ.కామ్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిపుణులైన అధ్యాపకులు సలహాలు, సూచనలు తెలియజేస్తారన్నారు. వివరాలకు 7997071672 ఫోన్ నంబరులో సంప్రదించాలని తిరుమలరావు కోరారు.

## 108లో శిశువు జననం

**ఏలేశ్వరం:** మండలంలోని పరిమితడక గ్రామానికి చెందిన జి.చిట్టమ్మ శుక్రవారం 108 వాహనంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. చిట్టమ్మకు నెలలు నిండడంతో ఆసుపత్రికి తీసుకువస్తుండగా పరిమితడక, జె.అన్నవరం గ్రామాల మధ్యలో మూడో కాన్పుగా మగ బిడ్డను ప్రసవించింది. తల్లీ బిడ్డా ఏలేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.



108 వాహనంలో జన్మనిచ్చిన తల్లి

# మహిళల కోచ్‌లో మగవారు ప్రయాణిస్తే చర్యలు

**రాజమహేంద్రవరం సిటీ:** రైళ్లలో ప్రయాణించే సమయంలో దివ్యాంగులు, మహిళలకు కేటాయించిన ప్రత్యేక బోగీల్లో మగవారు ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో విజయవాడ సీనియర్ డీఎస్‌ఈ వల్లేశ్వర బాపూజీ ఆదేశాలతో పలు రైళ్లలో మహిళలకు కేటాయించిన ప్రత్యేక కోచ్‌లను జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తో కలసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మూడు రైళ్లలో నిర్వహించిన తనిఖీలలో మహిళలకు కేటాయించిన కోచ్‌లలో ప్రయాణం చేస్తున్న 17 మంది పురుషులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి రాజమహేంద్రవరం రైల్వే కోర్టుకు తరలించారు. భవిష్యత్‌లో న్యాయస్థానం నుంచి సమన్లు వచ్చినప్పుడు కోర్టుకు హాజరు కావాలనే సూచనలతో వ్యక్తి గత బెయిల్‌పై విడిచి పెట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగనున్నదన్నారు. రైలు ప్రయాణంలో మహిళలు, దివ్యాంగులకు కేటాయించిన కోచ్‌లలో ఇతరులు ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణించవద్దన్నారు. నిబంధనలు మీరితే కేసులు తప్పవన్నారు.



నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు



## వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్

**చాగల్లు:** అప్పుల బాధ తట్టుకోలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ పి.నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చాగల్లుకు చెందిన బత్తిన శ్రీనివాస్ (45) వ్యవసాయ పని చేసుకుని జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం వాయిదాల పద్ధతిలో వారం వారం చెల్లించేలా రూ.4 లక్షలు ఫైనాన్స్ కంపెనీ వద్ద అప్పుగా తీసుకున్నాడు. రెండు వారాల క్రితం శ్రీనివాస్ పొలం పని చేస్తుండగా కాలుజారి పొలంలో పడడంతో చేతికి ఫ్రాక్చర్ అయింది. అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. పనికి వెళ్లకపోవడంతో వాయిదాలు కట్టడానికి డబ్బు లేదు. అప్పు ఇచ్చిన వారు వాయిదాలు కట్టకపోతే అల్లరి చేస్తారేమోనన్న భయంతో తన ఇంటిలో ఉన్న కలుపు మందు తాగాడు. అతని కుమారుడు వెంటనే ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతిచెందాడు. కుమారుని ఫిర్యాదుపై చాగల్లు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అడవిపంది హల్‌చల్

**పలువురిపై దాడి.. ఇద్దరికి గాయాలు**

**తాళ్లరేవు:** పటవల పంచాయతీలో శుక్రవారం అడవిపంది హల్‌చల్ చేసింది. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో అడవిపంది అత్యంత వేగంగా సంచరించడంతో స్థానికులు భయపడ్డారు. అడవిపందిని నియంత్రించేందుకు పలువురు యువకులు ప్రయత్నించడంతో వారిపై దాడి చేసింది. ఈ దాడిలో పటవల గ్రామానికి చెందిన మాసగిరి నాగబాబు తీవ్ర గాయాలపాలవగా, మరొక వ్యక్తికి చేతిపై స్వల్పగాయాలయ్యాయి. బైక్‌పై వెళుతున్న నాగబాబుపై ఒక్కసారిగా దాడి చేయడంతో అతని ఎడమ తొడ మీద తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన అతన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అడవి పంది సంచారాన్ని స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆచూకీ తెలియరాలేదు. పటవల నుంచి మట్లపాలెం మీదుగా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.



పటవలలో అడవిపంది దాడిలో గాయపడ్డ నాగబాబు

## కాపర్ వైర్ చోరీ చేసిన వ్యక్తికి రిమాండ్

**గండేపల్లి:** కాపర్ వైర్ చోరీ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని పెద్దాపురం కోర్టుకు తరలించినట్లు గండేపల్లి ఎస్సై ఎన్‌రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఏలేశ్వరం పట్టణానికి చెందిన పెంద్ర ప్రసాద్ అతని బంధైవైన పెంద్ర రవితో కలిసి మండలంలోని జెడ్.రాగంపేట, ఎర్రంపాలెం, పి.నాయకంపల్లి గ్రామాల్లోని పొలాల్లో వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించిన 12 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి దానిలో కాపర్ వైర్‌ను దొంగిలించారు. శుక్రవారం వీరద్దరు కాపర్ వైర్‌ను విక్రయించేందుకు రాజమహేంద్రవరం వస్తుండగా గండేపల్లి వచ్చేసరికి పెంద్ర ప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద కాపర్ వైర్‌తో పాటు 30 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్లు తెలిపారు. పెంద్ర రవి పరారీలో ఉన్నాడని, అతనిని త్వరలో పట్టుకుంటామన్నారు. ప్రసాద్‌ను రిమాండ్ కోసం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.


## సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ దుర్గాప్రసాద్‌రావుకు సత్యదేవుని చిత్రపటాన్ని అందచేస్తున్న ఈఓ రామచంద్రమోహన్

**అన్నవరం:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం రాత్రి రత్నగిరి పై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేయగా స్వామి వారి ప్రసాదాలు, సత్యదేవుని చిత్రపటాన్ని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అందజేశారు. జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు వెంట పలువురు న్యాయాధికారులు, పోలీస్, దేవస్థానం అధికారులు ఉన్నారు.

## నాటి మంత్రుల సలహాదారు శేషయ్య మృతి



కర్రి శేషయ్య

**కాకినాడ సిటీ:** జిల్లా పరిషత్ ఉద్యోగిగా, కేంద్ర, రాష్ట్ర మంత్రుల సలహాదారుగా వ్యవహరించిన కర్రి శేషయ్య (90) శుక్రవారం కాకినాడలో మరణించారు. ఈయన జిల్లా పరిషత్ ఉద్యోగిగా ఉంటూ కేంద్ర మంత్రి మల్లిపూడి పళ్లంరాజు (సీనియర్) వద్ద వ్యక్తిగత సలహాదారునిగా పని చేశారు. ఆ తరువాత రాష్ట్ర మంత్రులు తోట రామస్వామి, సంగిత వెంకటరెడ్డి, కేంద్ర మంత్రి మల్లిపూడి శ్రీరామసంజీవరావుల వద్ద సలహాదారునిగా పని చేశారు. ఎవరు ఏ సహాయం అడిగినా చేస్తూ ఎందరికో ఉద్యోగవకాశాలు కల్పించి, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారు కర్రి శేషయ్య. సురుచి స్వీట్స్ అధినేత మల్లిబాబు శేషయ్య అల్లుడు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

# విలువలతో కూడిన విద్యే లక్ష్యం

**ఉండ్రాజవరం:** క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. మండలంలో వేలివెన్ను శశి క్యాంపస్‌లో జాతీయ విద్యావిధానం, సీబీఎస్‌ఈ కోర్సుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో అనేక మార్పులు జరిగాయన్నారు. దానికి అనుగుణంగా శశి వేలివెన్ను క్యాంపస్‌లో విద్యా ప్రణాళికలో మార్పులు చేశామని, సీబీఎస్‌ఈ వలన విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల (ఐఐటీ, ఎన్ఐటీ, నీట్)లో రాణిస్తున్నారన్నారు. అకడమిక్ డైరెక్టర్ చిట్టూరి శేషుబాబు మాట్లాడుతూ 10వ తరగతి తరువాత విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. మరో అకడమిక్ డైరెక్టర్ మన్నె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 44 సంవత్సరాల అనుభవం ఉన్న అధ్యాపక బృందంతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఎం.పరాత్పరరావు, అంబిక మాట్లాడుతూ తమ కుమారుడు ఎం.కీర్తితేజ ఆలిండియా 11వ ర్యాంకు సాధించాడని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న శశి విద్యాసంస్థల చైర్మన్ రవికుమార్

సాక్షి బిజినెస్
శనివారం
30-3-2024

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు (గురువారం ముగింపు) | |
|---|---|
| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
| 655 | 203 |
| 73,651 | 22,327 |

| విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 16,379 | ▽ | 20 |
| డోజోన్స్ | 39,807 | ▲ | 47 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,953 | ▲ | 21 |
| డాక్స్ | 18,492 | ▲ | 15 |
| షాంఘై | 3,041 | ▲ | 30 |
| నికాయ్ | 40,369 | ▲ | 201 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 82.95 | 93.97 |
| £ | బ్రిటన్ పౌండ్ | 104.23 | 106.78 |
| € | యూరో | 89.30 | 91.68 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 55.64 | 55.75 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | 53.64 | 55.56 |
| S$ | సింగపూర్ డాలర్ | 59.64 | 64.35 |
| SAR | సౌదీ రియాల్ | 21.30 | 22.88 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 21.78 | 23.57 |
| ¥ | చైనా యువాన్ | 10.42 | 12.49 |



# దేశంలో ఆధ్యాత్మిక టూరిజం జోష్

**రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి ● లిస్టులో తిరుపతి, అయోధ్య, వారణాసి**

**న్యూఢిల్లీ:** ఆధ్యాత్మిక పర్యాటకంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో బడా రిటైల్ బ్రాండ్లు ఆధ్యాత్మిక కేంద్రాలపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందించే దిశగా తిరుపతి, అయోధ్య, వారణాసి, అమృత్‌సర్, పూరి, అజ్మీర్ వంటి నగరాల్లో గణనీయంగా విస్తరిస్తున్నాయి. 14 కీలక నగరాల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక టూరిజంతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రిటైల్ చెయిన్స్ అనుసరిస్తున్న వ్యూహాలపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మదురై, గురువాయూర్, ద్వారకా, మథురా తదితర నగరాల్లో కూడా రిటైల్ బూమ్ కనిపిస్తున్నట్లు రిపోర్టు పేర్కొంది. పేరొందిన మాల్స్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా టూరిస్టులను ఆకర్షించేలా తమ బ్రాండ్లను ప్రదర్శించడంపై రిటైల్ సంస్థలు దృష్టి పెడుతున్నాయి. అయోధ్యలో మాన్యవర్, రిలయన్స్ ట్రెండ్స్, రేమండ్స్, మార్కెట్99, ప్యాంటలూన్స్, డామినోస్, పిజ్జా హట్, రిలయన్స్ స్మార్ట్ మొదలైనవి తమ రిటైల్ స్టోర్స్ ప్రారంభించినట్లు నివేదిక వివరించింది. వారణాసిలో జుడియో, షాపర్స్ స్టాప్, బర్గర్ కింగ్ తదితర సంస్థలు కూడా కార్యకలాపాలు విస్తరించినట్లు పేర్కొంది. టూరిజంను ప్రోత్సహించేందుకు, కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం లభిస్తున్నట్లు సీబీఆర్‌ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ఫ్యాషన్, ఫుడ్ అండ్ బెవరేజెస్, హైపర్‌మార్కెట్లు మొదలైన సంస్థలన్నీ కూడా భక్తుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను అందిస్తూ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వివరించారు. ఆధ్యాత్మిక టూరిజం ట్రెండ్‌తో ఆయా ప్రాంతాల్లో ఆతిథ్య, రిటైల్ రంగాలకు కలిసి వస్తోందని సీబీఆర్‌ఈ ఇండియా ఎండీ రామ్ చంద్నానీ తెలిపారు.

## ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులు

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ ఇటువైపు చూస్తున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో ఏకంగా రూ. 2 లక్షల కోట్ల పైగా ఇన్వెస్ట్ చేశారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. 2020–21లో ఏకంగా రూ. 2.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు ఆ మరుసటి సంవత్సరం రూ. 1.4 లక్షల కోట్లు, ఆ తర్వాత 2022–23లో రూ. 37,632 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2023–24లో భారీగా ఇన్వెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సానుకూలంగా కొత్త ఏడాది..**

కొత్త ఆర్థిక సంవత్సరంపై కూడా అంచనాలు కాస్త సానుకూలంగానే ఉన్నాయని భారత్‌లో మజార్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ తెలిపారు. పురోగామి పాలసీ సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాల కారణంగా దేశంలోని ఎఫ్‌పీఐల ప్రవాహం స్థిరంగా కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాల కారణంగా మధ్యమధ్యలో ఒడిదుడుకులు ఉండవచ్చన్నారు.

## చిన్న షేర్ల పెద్ద ర్యాలీ

**60 శాతానికి మించి రాబడులు ● 2023–24లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా**

**న్యూఢిల్లీ:** దలాల్ స్ట్రీట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023 –24)లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా కొనసాగింది. దేశంలో దృఢమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు అధిక ఆసక్తి చూపారు. 2023–24లో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 62%, స్మాల్ క్యాప్ సూచీ 60% రాణించాయి. ఇదే కాలంలో బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 25% పెరిగింది.

''ఆదాయాలు గణనీయంగా పెరగడం, అధిక వృద్ధి అవకాశాలతో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్లను కొనుగోలుకు ఆసక్తి చూపారు. లార్జ్ క్యాప్ షేర్ల పట్ల విముఖత చూపారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నికర పెట్టుబడులు పెరగడం ఇందుకు నిదర్శనం. ఆర్థిక విస్తరణ సమయంలో చిన్న, మధ్య తరహా షేర్ల వృద్ధి వేగంగా ఉంటుందనే సంప్రదాయ సూత్రాన్ని వారు విశ్వసించారు. అంతేకాకుండా స్మాల్, మిడ్ సైజ్ కంపెనీల అద్భుతమైన త్రైమాసిక ఫలితాలు వారిని కొనుగోళ్ల వైపు ఆకర్షితం చేశాయి'' అని హెడ్జ్ ఫండ్ హెడోనోవా సీఐఓ సుమన్ బెనర్జీ తెలిపారు.



- 2023-24లో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫిబ్రవరి 8న 40,282 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. గతేడాది మార్చి 31న 23,881 వద్ద ఏడాది కనిష్ఠానికి తాకింది.
- ఇదే కాలంలో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ ఫిబ్రవరి 7న 46,821 వద్ద ఆల్‌టైం హైని నమోదు చేయగా, గతేడాది మార్చి 31న 26,692 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని తాకింది.
- సెన్సెక్స్‌తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి షేర్ల అత్యుత్తమ ప్రదర్శన భారత ఈక్విటీ మార్కెట్ క్రియాశీలక స్వభావాన్ని, ఇన్వెస్టర్ల అపార వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతీ తెలిపారు.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ చిన్న, మధ్య తరహా షేర్ల ర్యాలీ కొనసాగుతుందని న్యాతీ అభిప్రాయపడ్డారు. "సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వమే తిరిగి అధికారాన్ని దక్కించుకోవచ్చనే అంచనాలతో వ్యాపార అనుకూల వాతావరణం పెంపొంది స్థిరమైన వృద్ధి కొనసాగొచ్చు. దీనికి తోడు భారత వృద్ధి బలమైన అవుట్‌లుక్ అంచనాలు ఈ రంగాల షేర్లకు డిమాండ్‌ను పెంచుతాయి" న్యాతీ తెలిపారు. అయితే కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు, అంతర్జాతీయ అనిశ్చితులు, లాభాల స్వీకరణ వంటి అంశాలు స్వల్పకాలిక ఒడిదుడుకులకు దారితీయొచ్చన్నారు.

### ఐపీవో బాటలో ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా

ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈ షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఐపీవోతో రూ. 7,000 కోట్లు సమకూర్చుకోనుంది.

### రూ. వెయ్యి కోట్లకు జిరోధా ఫండ్ విలువ

జిరోధా, స్మాల్‌కేస్ జేవీ జిరోధా ఫండ్ హౌస్ నిర్వహణలోని ఆస్తుల విలువ కేవలం 40 రోజుల్లో రూ. 500 కోట్ల మేర ఎగిసింది. దీంతో సంస్థ ఏయూఎం రూ. 1,000 కోట్ల మార్కును దాటింది.

### 300 నగరాల్లో కియా కేంద్రాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కియా ఇండియా విక్రయ, సర్వీస్ కేంద్రాలను విస్తరిస్తోంది. కియా 2.0 వ్యూహంలో భాగంగా డిసెంబర్‌కల్లా 300 నగరాలు, పట్టణాల్లో అడుగు పెట్టడం ద్వారా టచ్ పాయింట్స్ సంఖ్యను 700లకు చేరుస్తామని ప్రకటించింది. ప్రస్తుతం 236 నగరాలు, పట్టణాల్లో కంపెనీకి 522 సేల్స్, సర్వీస్ సెంటర్స్ ఉన్నాయి.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 30-3-2024 ఫామ్ ధర... | |
|---|---|
| విశాఖ | 415-00 |
| చిత్తూరు | 458-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 400-00 |
| విజయవాడ | 400-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 375-00 |
| వరంగల్ | 377-00 |
| రిటైల్ ధర | 4.35 |

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో వాటా విక్రయం

**బ్యాంక్ నుంచి వార్‌బర్గ్ పింకస్ ఔట్**

**న్యూఢిల్లీ:** పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుంచి పూర్తిగా వైదొలగింది. తాజాగా బ్యాంకులోగల మొత్తం 2.25 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 75.24 సగటు ధరలో 15.88 కోట్ల బ్యాంకు షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,195 కోట్లుకాగా.. క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా 2023 డిసెంబర్‌కల్లా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 2.25 శాతం వాటాను కలిగి ఉంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 4.2% వాటాను వార్‌బర్గ్ పింకస్ రూ. 2,480 కోట్లకు విక్రయించిన విషయం విదితమే. కాగా.. గురువారం బీఎస్‌ఈలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు 3.1% క్షీణించి రూ. 75.4 వద్ద ముగిసింది.

## హైరింగ్ ప్రణాళికల్లో స్టోరబుల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెల్ఫ్–స్టోరేజ్ టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికన్ సంస్థ స్టోరబుల్ భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో 15వేల చ.అ. విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. గతేడాదే హైదరాబాద్‌లో తమ ఏషియా జీసీసీని స్టోరబుల్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ 60 మంది ఉద్యోగులు ఉండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 120కి పెంచుకోనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు. ఇంజినీరింగ్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు.

# సినిమా

## డిసెంబరులో ఆరంభం



● ప్రభాస్

ఈ ఏడాది డిసెంబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారని తెలిసింది. హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సిన్సియర్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది డిసెంబరులో ఆరంభించేలా ప్లాన్ రెడీ చేస్తున్నారట సందీప్ రెడ్డి వంగా. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రష్మికా మందన్నా, కీర్తీ సురేష్, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించనున్నారు. భూషణ్ కుమార్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

## టీజర్ రెడీ

'పుష్ప : ది రూల్' సినిమా టీజర్‌కు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. హీరో అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న 'పుష్ప: ది రూల్' సినిమా టీజర్‌ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. 'పుష్ప: ది రూల్' సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఇక 'పుష్ప' సినిమా ఫ్రాంచైజీలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సినిమా సక్సెస్ కావడంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దర్శకుడు త్రివిక్రమ్, మరో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాలతో అల్లు అర్జున్ సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల అప్‌డేట్స్ కూడా అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న వచ్చే అవకాశం ఉంది. ఇంకా అల్లు అర్జున్–దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లోని కొత్త సినిమా ప్రకటన కూడా రావొచ్చనే ప్రచారం జరుగుతోంది.



● అల్లు అర్జున్

## ఆలియాకు విలన్‌గా...?



● బాబీ డియోల్

ఆలియా భట్, శార్వరి లీడ్ రోల్స్‌లో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్‌గా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందట. శివ్ రావైల్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. గతంలో 'రాజీ' సినిమాలో స్పై పాత్రలో నటించిన ఆలియా భట్ మళ్లీ ఈ సినిమాలో ఆ తరహా పాత్రను ఓకే చేయడం విశేషం. ఇక 'యానిమల్'లో విలన్ రోల్‌లో బాబీ డియోల్ విజృంభించిన విషయం తెలిసిందే. మరి.. యశ్ రాజ్ ఫిలింస్ తాజా చిత్రంలో విలన్‌గా సై అంటే... మరోసారి బాబీ నెగటివ్ పెర్ఫార్మెన్స్‌ని చూసే వీలు దక్కుతుంది.



● బనితా సంధు

## ఇటు మెకానిక్ రాకీ.. అటు లైలా!



● మెకానిక్ రాకీలో విశ్వక్ సేన్

బర్త్ డే (మార్చి 29) రోజున హీరో విశ్వక్ సేన్ డబుల్ ధమాకా అందుకున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న రెండు కొత్త సినిమాల వివరాలను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. విశ్వక్ టైటిల్ రోల్‌లో నటించనున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నరేశ్, 'వైవా' హర్ష, హర్షవర్ధన్ కీలక పాత్రల్లో నటిస్తారు. రవితేజ ముళ్లపూడిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ లుక్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ స్వరకర్త. అలాగే విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న మరో సినిమా 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. ఈ సినిమాలో సెకండాఫ్‌లో లైలా అనే అమ్మాయిగా విశ్వక్ కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాకు తనిష్క్ బాగ్చి మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాలే కాకుండా విశ్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే సినిమా చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 17న విడుదల కానుంది.

## అందరూ కనెక్ట్ అవుతారు


సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారని శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ పేర్కొంది.



● రుహానీ శర్మ

## ఆస్కార్ విజేత లూయిస్ గోసెట్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. అమెరికన్ ప్రముఖ నటుడు, ఆస్కార్ అవార్డు విజేత లూయిస్ గోసెట్ జూనియర్ (87) కాలిఫోర్నియాలో కన్నుమూశారు. లూయిస్ మరణాన్ని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించినట్లుగా హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ఇక 1936లో లూయిస్ గోసెట్ సీనియర్, హెలెన్ రెబక్కా దంపతులకు మే 27న న్యూయార్క్‌లో జన్మించారు లూయిస్ గోసెట్ జూనియర్. చిన్నతనంలోనే లూయిస్‌కు నటన పట్ల ఆసక్తి ఉండేది. అలా 17ఏళ్ల వయసులోనే రంగస్థల నటుడిగా మారాడు లూయిస్. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. 'ఎ రైసిన్ ఇన్ ది సన్, ది బ్లాక్స్, ది పనిషర్, స్కిన్‌గేమ్' వంటి సినిమాల్లో నటించారు. 'ది బుక్ ఆఫ్ నీగ్రోస్' వంటి టెలివిజన్ సిరీస్‌లలో కూడా నటించారు లూయిస్. ఇక 1982లో వచ్చిన 'యాన్ ఆఫీసర్ అండ్ ఏ జెంటిల్‌మేన్' సినిమాలోని నటనకుగాను 55వ ఆస్కార్ అవార్డ్స్‌లో లూయిస్ ఉత్తమ సహాయ నటుడు విభాగంలో అవార్డు అందుకున్నారు. కాగా ఈ విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి నటుడు లూయిస్‌నే అని హాలీవుడ్ సమాచారం. అలాగే ఇదే సినిమాకు ఉత్తమ సహాయ నటుడు విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా దక్కించుకున్నారు. 1977లో వచ్చిన మినీ సిరీస్ 'రూట్స్'లోని నటన లూయిస్‌కి మంచి పేరు తెచ్చిపెట్టడంతో పాటు ఎమ్మీ అవార్డు కూడా అందుకునేలా చేసింది.



## వేసవిలో వస్తున్నా డియర్

ఒక కుటుంబంలో ఓ సమస్య వస్తుంది? ఆ సమస్యను ఆ కుటుంబం ఎలా పరిష్కరించింది? వివాహ బంధం సుదీర్ఘంగా సాగడానికి ఏం అవసరం? వంటి అంశాలతో రూపొందిన చిత్రం 'డియర్'. జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా ఒక్క రోజు గ్యాప్‌లో విడుదల కానుంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానున్నాయి. తెలుగు వెర్షన్ ఆంధ్ర హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణ రైట్స్ ఏషియన్ సినిమాస్ దక్కించుకున్నాయి. ''చక్కని కామెడీ ఫ్యామిలీ డ్రామాగా 'డియర్'ని వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. తమిళంలో పాటలు పాపులర్ అయ్యాయి. త్వరలోనే తెలుగు పాటలను విడుదల చేయనున్నాం'' అని తెలుగు హక్కులు సొంతం చేసుకున్న సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.




● జీవీ ప్రకాశ్, ఐశ్వర్య

## స్పైతో బనితా ఎంట్రీ

'అక్టోబర్, సర్దార్ ఉదమ్' వంటి హిందీ చిత్రాలతో, తమిళ చిత్రం 'ఆదిత్య వర్మ'తో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు బనితా సంధు. ఈ బ్యూటీ 'జీ 2' (గూఢచారి 2) చిత్రంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు పరిచయం కానున్నారు. అడివి శేష్ హీరోగా రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ (2018) 'గూఢచారి'కి సీక్వెల్‌గా పాన్ ఇండియా స్థాయిలో 'జీ 2' తెరకెక్కుతోంది. గూఢచారిగా హీరో అడివి శేష్ నటిస్తున్నారు. ఈ స్పై సరసన బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బనితా జాయిన్ అయిన విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ''శేష్, బనితాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. తెరపై ఇద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. హై ఆక్టేన్ యాక్షన్ మూవీగా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ''ఈ చిత్రంలో నటించడం క్రియేటివ్‌గా నాకు చాలా హ్యాపీగా ఉంది. ఇప్పటివరకూ చేయని పాత్రను ఈ చిత్రంలో చేస్తున్నాను'' అని బనితా సంధు అన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర చేస్తున్నారు.

## కథ రెడీ అవుతోంది!



టామ్‌క్రూజ్

హాలీవుడ్ ఫిల్మ్ 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం 'టాప్‌గన్ 3' సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి రెండు భాగాలు 'టాప్‌గన్', 'టాప్‌గన్: మావెరిక్' లో హీరోగా నటించిన టామ్ క్రూజ్‌యే 'టాప్ గన్ 3'లోనూ హీరోగా నటించనున్నారని తెలుస్తోంది. ''టాప్‌గన్ 3' బేసిక్ కథ సిద్ధంగా ఉంది. టామ్ క్రూజ్‌కు స్టోరీలైన్ చెప్పాం. ఆయన నచ్చిందని చెప్పారు. కథకు మెరుగులు దిద్దే పనిలో ఉన్నాం'' అని 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నిర్మాతల్లో ఒకరైన జెర్రీ బ్రూమ్ హైమర్ పేర్కొన్నారు.